ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
1★★★ జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

నేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే 4

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి 4



ఓటు బదిలీ జరిగేనా?

- వలస నేతల బలమెంత
- పార్టీ మారినా.. ఓటర్లు మారేనా?
- జిల్లాలో వలస రాజకీయాలపై సందిగ్ధం
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4.72 లక్షల మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కాంగ్రెస్ సర్కారు రావడంతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి నాయకులు క్యూ కట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ పార్టీని వీడిన వారు సైతం మళ్లీ సొంతగూటికి చేరుతున్నారు. తిరిగి వచ్చిన నేతలు, పార్టీ మారిన వలస నేతలు అంతా తమదే పెత్తనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మరికొందరు బీఆర్ఎస్ నుంచి బీజేపీ బాట పట్టిన వారూ ఉన్నారు. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో వలస వచ్చిన నేతలతో లోక్‌సభ ఎన్నికల్లో ఎంతవరకు ప్రయోజనం చేకూరుతుందనే చర్చ పార్టీలో మొదలైంది.

● వలస నేతలతో ఓటర్లు మారేనా?

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో వలస రాజకీయాలు జోరుగా సాగుతున్నా ఓటర్ల తీరు మాత్రం అంతు చిక్కడం లేదు. తమ మారినంత మాత్రానా ఓటర్లు మారుతారా అనే సందిగ్ధం నెలకొంది. ప్రధానంగా బీఆర్ఎస్‌ను వీడుతున్న నాయకులు కాంగ్రెస్, బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారు. పార్టీలు మారుతున్న నాయకుల వెంట పదుల సంఖ్యలో కూడా అనుచరులు ఉండకపోవడం గమనార్హం. సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో 4.72 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,212 మంది, వేములవాడ 2,25,904 మంది ఉన్నారు. 2023 శాసన సభ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఒకటి, కాంగ్రెస్ మరొకటి గెలుచుకుంది. చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి, మానకొండూర్ నియోజకవర్గంలోని ఇల్లంతకుంట మండలాలు రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్నాయి. ఈ నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలే గెలుపొందారు. సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్‌లలో సిరిసిల్లలో బీఆర్ఎస్‌కు 89,244 ఓట్లు, కాంగ్రెస్‌కు 59,557, బీజేపీకి 18,328 ఓట్లు లభించాయి.

వేములవాడ సెగ్మెంట్‌లో కాంగ్రెస్‌కు 71,451, బీఆర్ఎస్‌కు 56,870 ఓట్లు, బీజేపీకి 29,710 ఓట్లు లభించాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు 70,482 ఓట్లు, బీజేపీకి 64,769, కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, వేములవాడ సెగ్మెంట్‌లో బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్ఎస్‌కు 47,399, కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు లభించాయి. ప్రస్తుతం వలసల నేపథ్యంలో ఓటర్లు ఏ మేరకు మారుతారు? ఏ పార్టీకి లాభం చేకూరుతుందనే చర్చ జోరుగా సాగుతోంది.

● ఆగని వలసలు

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో వలసల పరంపర కొనసాగుతూనే ఉంది. లోక్‌సభ ప్రచారం ఊపందుకునే సమయంలో వలసలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత వరుసగా సర్పంచ్, జడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికలు ఉండడంతోనే తమ రాజకీయ భవిష్యత్ కోసం అధికార పార్టీలో చేరుతున్నట్లు తెలుస్తోంది. కొత్తగా చేరుతున్న నేతలతో పార్లమెంట్ అభ్యర్థులకు ఎంతవరకు కలిసి వస్తుందనే మాట ఎలా ఉన్నా అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకున్న బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్చుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వలస నేతలతో ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న వారు తమ ప్రాధాన్యం తగ్గిపోతోందని ఆందోళన చెందుతున్నారు. పార్టీలు మారి వచ్చిన వారు మళ్లీ పెత్తనం మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో పార్టీలో విభేదాలు కొని తెచ్చినట్లుగా భావిస్తున్నారు. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడం, నామినేషన్లు వేయడం పూర్తయ్యింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిపోవడంతో వలస నేతల్లో మరింత సందడి పెరగనుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లో వలసలు మరింత ఊపందుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

వైభవంగా రథోత్సవం



సీతారామస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గంభీరావుపేట, ఏప్రిల్ 25: 'సీతారామస్వామి గోవిందా గోవిందా' అనే భక్తుల నామస్మరణ మధ్య గంభీరావుపేటలో బ్రహ్మోత్సవాల సందర్భంగా రామచంద్రమూర్తి రథోత్సవం వైభవంగా సాగింది. మండల కేంద్రంలోని సీతారాంబజార్ వెంట సాగిన రథంపై నుంచి వేలాది భక్తులకు సీతారాముడు దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు సీతారామస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

- చివరి రోజు 16 మంది అభ్యర్థులు.. 32 నామినేషన్లు

- నేడు పరిశీలన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల స్వీకరణ గడువు ముగిసింది. గురువారం కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో చివరి రోజు 16 మంది అభ్యర్థులు 32 నామినేషన్ల పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతికి అందజేశారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతికి అందజేశారు. మరో 15 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసే వరకు మొత్తం 53 మంది అభ్యర్థులు 94 నామినేషన్లను దాఖలు చేశారు. శుక్రవారం నామినేషన్ల పరిశీలన, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. మే 13న ఎన్నికలు, జూన్ 4న ఓట్ల లెక్కింపు ఫలితాలను వెల్లడిస్తారు.

అయ్యప్ప ఆలయంలో మహా చండీ యాగం

రుద్రంగి ఏప్రిల్ 25: రుద్రంగి మండల కేంద్రంలోని నూతన అయ్యప్ప ఆలయంలో గురువారం మహా చండీయాగని నిర్వహించారు. మహా చండియాగాన్ని గూడెం గురుస్వామి చక్రవర్తుల పురుషోత్తం ఆధ్వర్యంలో వేద పండితులతో నిర్వహించగా 50 మంది జంటలు పూజలో పాల్గొన్నారు. అలాగే రాత్రి మెట్ల పూజ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేలుకల తిరుపతి, ఎంపీటీసీ మంచి లావణ్య రాజేశం, వడ్ల నారాయణ, నారాయణరెడ్డి, కాసోజి గణేష్, బండారి నరసయ్య, గడ్డం స్వామి, అట్టపెల్లి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, కాంగ్రెస్ పాలనకు మధ్య తేడాను వివరించాలి

- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ ఓటరును కలిసి కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు మధ్య ఉన్న తేడాను వివరించాలని, నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో విరక్తి పెరిగిందని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కే తారకరామారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల వారీగా క్లస్టర్ స్థాయి సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచార నిర్వహణపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో కొట్లాడి నిధులు సాధించే బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఎంపీ ఎన్నికల ప్రచారం కోసం వచ్చే నెల 10న సిరిసిల్లకు కేసీఆర్ వస్తున్నారని, మండలాల వారీగా పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. విద్వేషం పేరుతో రాజకీయం చేసే వారికి ఓటు వేస్తే అభివృద్ధి స్థానంలో విధ్వంసం జరుగుతుందన్నారు. ప్రజలు చైతన్యవంతులని, కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న మిలాఖత్ రాజకీయాలను గమనిస్తున్నారని అన్నారు. కరీంనగర్‌లో వినోద్‌కుమార్ వంటి సీనియర్ నేతను గెలిపించుకోవాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారని, విద్వేష రాజకీయాలకు మనవద్ద చోటు లేదని అన్నారు. నాలుగు నెలలు గడవక ముందే కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో విరక్తి పెరిగిందని, కరెంట్ కోతలతో రైతులు ఆగమై పోతున్నారని అన్నారు. సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, రైతుల గురించి అడిగితే ఒక్కో మంత్రి ఒక్కో మాట మాట్లాడుతున్నారని అన్నారు. రైతుల పక్షాన బాధ్యత తీసుకునే వారే లేరన్నారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

హరీష్ రావు రాజీనామా పత్రాన్ని సిద్ధం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, ఏప్రిల్ 25: హరీష్‌రావు రాజీనామా పత్రాన్ని సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని ఇస్లాం నగర్‌లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారని గుర్తు చేశారు. త్వరలోనే ఇస్లాం నగర్ ప్రజల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. భాజపా వ్యతిరేక విధానాలను ప్రజలందరూ గమనించాలన్నారు. రైతులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తెచ్చారని, నేతన్నలకు జీఎస్టీ విధించిందన్నారు. దేశాన్ని మతం, ప్రాంతాల పేరిట విడదీయాలని చూస్తోందన్నారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ రైతు వర్గాలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటున్న బీజేపీని వ్యతిరేకించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం దేశాన్ని విచ్చినం చేయాలని చూస్తోందన్నారు. దానికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు, భారత్ జోడో పాదయాత్ర చేశారన్నారు. దేశంలో మొదటి విడత ఎన్నికలు పూర్తయిన తర్వాత ప్రజానాడి బీజేపీకి వ్యతిరేకంగా ఉందని తెలిసి నరేంద్ర మోదీని భయం పట్టుకుందన్నారు. బీజేపీ ప్రజల్లో భాగోద్వేగాన్ని రెచ్చగొట్టి ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేసి తీరుతానని అన్నారని, అది సాధ్యం కాదని హరీష్ రావు మాట్లాడుతున్నారని అన్నారు. రైతులకు రుణమాఫీ కాకుండా చేయాలని చూస్తున్నట్లు తెలుస్తోందన్నారు. గడిచిన పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చూసి బీఆర్ఎస్ వారు ఓర్వలేక పోతున్నారన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల పేరిట రాజకీయాలా?

- కరీంనగర్‌కు బండి సంజయ్ ఒక్కపైసా తేలేదు
- వినోద్‌కుమార్‌కే ఢిల్లీలో కొట్లాడే సత్తా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - కోనరావుపేటలో రోడ్ షో



కోనరావుపేట రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

కోనరావుపేట, ఏప్రిల్ 25: దేవుళ్లను అడ్డుపెట్టుకొని బీజేపీ, కాంగ్రెస్ రాజకీయాలు చేస్తున్నాయని, బండి సంజయ్ కరీంనగర్ అభివృద్ధికి ఒక్క పైసా తేలేదని, బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌కే ఢిల్లీలో కొట్లాడే సత్తా ఉందని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలో కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి గురువారం రాత్రి రోడ్‌షోలో మాట్లాడారు. 15 ఆగస్టు వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే 15 ఆగస్టు వరకు రుణమాఫీ చేస్తానని భార్యాపిల్లలపై ఒట్టు వేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారన్నారు. మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మితో తులం బంగారం, రూ.2 లక్షల రుణమాఫీ, పెన్షన్ రూ.4 వేలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికే పెన్షన్ ఒక నెల ఎగ్గొట్టారన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 24 గంటల ఉచిత కరెంట్ అందజేశామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కరెంట్ పోవడం, ప్రాజెక్టులను ఎండబెట్టడం, సాగునీరు ఇవ్వకపోవడం వంటివి చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజల పరిస్థితి పాలిచ్చే బర్రెను అమ్ముకొని దున్నపోతును తెచ్చుకున్నట్లయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి 150 రోజులు గడిచినా ఏ ఒక్క పథకం అమలు కావడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన రైతుబంధును ఇవ్వనోడు రూ.2 లక్షల రుణమాఫీ ఎలా చేస్తారన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నారని, ప్రజల ఆదాయం డబుల్ చేస్తానని ఏం చేశారని అన్నారు. బుల్లెట్ రైళ్లు తెస్తానన్నాడని, ఏమైందని ప్రశ్నించారు. కరీంనగర్ ఎంపీగా గెలిచిన బండి సంజయ్ కరీంనగర్‌కు ఏం తెచ్చారో చెప్పాలన్నారు. బండి సంజయ్ చేసిన అభివృద్ధి చెప్పమంటే జైశ్రీరాం అంటారన్నారు. ఢిల్లీలో పెద్దోడు మోదీ, చిన్నోడు బండి సంజయ్ దేవుళ్లను అడ్డుపెట్టుకొని రాజకీయం చేస్తున్నారన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు యాదగిరి గుట్టను అభివృద్ధి చేశారని, దేవుళ్లను అడ్డుపెట్టుకొని తాము ఓట్లు అడగబోమని అన్నారు. మళ్లీ కేసీఆర్ రావాలంటే 12 ఎంపీ సీట్లు గెలిపించాలన్నారు. కేసీఆర్ సర్కార్ మళ్లీ ఏడాదిలో అధికారంలోకి వస్తుందన్నారు. చీకటి ఉన్నప్పుడే వెలుగు విలువ తెలుస్తుందన్నారు. కాంగ్రెస్ వచ్చింది నేతన్నల ఆత్మహత్యలు మొదలయ్యాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన దొంగ హామీలకు ప్రజలు మోసపోయారని, రైతులకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ ఎప్పుడిస్తారన్నారు. ప్రజలు కారు గుర్తుపై ఓటు వేసి వినోదన్నను గెలిపించాలని, కరీంనగర్ సత్తాను చాటాలని కోరారు.

● అభివృద్ధిని విస్మరించిన బండి సంజయ్

అనంతరం ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ 2014లో హైదరాబాద్ నుంచి సిద్దిపేట వరకు రైలు మార్గాన్ని తీసుకొచ్చామన్నారు. త్వరలోనే సిరిసిల్ల, వేములవాడకు పూర్తవుతుందన్నారు. తన హయాంలో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీగా మార్చామన్నారు. బండి సంజయ్ ధర్మం.. ధర్మం అంటూ అభివృద్ధిని విస్మరించారన్నారు. ఎంపీగా ఐదేళ్ల కాలంలో రూ.5 కూడా తీసుకురాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఉపాధి హామీ నిధులు తమవేనని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ పాలనలో కోనరావుపేట మండలం మల్కపేటలో ప్రాజెక్టును నిర్మించి మూడు టీఎంసీల నీటిని తీసుకొచ్చినట్లు చెప్పారు. రోడ్లకు వంతెనల కోసం నిధులు తెచ్చామన్నారు. మల్కపేటలో చల్మెడ కుటుంబసభ్యులు రూ.6 కోట్లతో రామాలయాన్ని, రూ.2కోట్ల సొంత నిధులతో పాఠశాలను నిర్మించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ ఎంపీగా పనిచేసిన వినోద్ కుమార్, బండి సంజయ్ పాలనలో ఎవరు ఎంత అభివృద్ధి చేశారన్నది ప్రజలు గ్రహించాలన్నారు. ఎంపీ బండి సంజయ్ ఐదేళ్ల పాలనలో ఎలాంటి నిధులూ తీసుకురాలేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య, సెస్ వైస్ చైర్మన్ తిరుపతి, ప్యాక్స్ చైర్మన్లు బండ నర్సయ్య, రామ్మోహన్‌రావు, రాఘవరెడ్డి, రమణారెడ్డి, మంతెన సంతోష్, గోపు పర్శరాములు, అవ్వరం శరత్, గెంటె శ్రీనివాస్, కాశవేణి మహేష్, తాళ్లపెల్లి సతీష్, వంగపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోకు హాజరైన జనం

ఉపాధి పనుల పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్, రాగట్లపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను గురువారం డీఆర్‌డీవో శేషాద్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో కూలీలు వడదెబ్బకు గురవకుండా ఉపాధి పనులు చేయాలన్నారు. ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వజీర్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

వీర్నపల్లి, ఏప్రిల్ 25 ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంతోపాటు లాల్‌సింగ్‌తండా, వన్‌పల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వివరాలను ఆన్‌లైన్ ఎంట్రీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యంను రైస్‌మిల్లర్లకు వెంటనే తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను రైతుల వారీగా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు అందడంలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు వసతులు కల్పించాలన్నారు. ఈజీఎస్ ఏపీడీ నర్సింహులు, మార్కెటింగ్ డీపీఎం పాపారావు, ఏపీఎం నర్సయ్య ఉన్నారు.

మలేరియాపై పోరాటమే లక్ష్యం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 25: ఆరోగ్యకరమైన ప్రపంచం కోసం మలేరియాపై పోరాటమే లక్ష్యమని డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్ మోహన్‌రావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలో ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు ప్రారంభించారు. అనంతరం స్థానిక యూపీఎస్‌సీ పీఎస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సుమన్ మోహన్‌రావు మాట్లాడారు. డబ్ల్యుహెచ్‌వో పిలుపు మేరకు 2030 సంవత్సరం నాటికి మలేరియా నిర్మూలనకు కలసి పని చేయాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 25: ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ కేంద్రానికి కళ్లు చెవుల వంటి వారన్నారు. పోలింగ్‌కు ముందురోజు, పోలింగ్‌రోజు పోలింగ్ కేంద్రాన్ని నిశితంగా పరిశీలించాలని, ఎన్నికలు జరిగిన తీరును పర్యవేక్షించి నివేదికను ఎన్నికల సాధారణ పరిశీలకు సమర్పించాలన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, లీడ్‌బ్యాంక్ మేనేజర్ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా మేఘన

సిరిసిల్లక్రైం, ఏప్రిల్ 25: సిరిసిల్ల రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా గడ్డం మేఘనను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్(విజిలెన్స్) గురువారం ఉత్తర్వులు జారీచేశారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన మేఘన తొలిప్రయత్నంలోనే మార్చినెలలో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై తొలి పోస్టింగ్‌లోనే సిరిసిల్లకు కేటాయించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

బోయినపల్లి, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ అన్నారు. బోయినపల్లి మండలం కొదురుపాక, విలాసాగర్ ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్ పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వెంట వెంటనే కొనుగోలు జరపాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ పుష్పలత తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టం దోపిడీ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 25: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల కష్టాన్ని దోచుకుంటున్నారని రైతుకూలి సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్ అన్నారు. మండలంలోని గాలిపెల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వ్యవహరించిన మాదిరిగానే ఇప్పుడు ధాన్యం అధిక తూకం వేస్తున్నారని ఆరోపించారు. మిల్లులకు ధాన్యం వెళ్లిన తర్వాత కూడా కోతలు విధిస్తుండడంతో రైతులు విధిలేని పరిస్థితులలో ఒప్పుకుంటున్నారని, అధికారులు కనీసం కేంద్రాలను సందర్శించడం లేదని అన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో మాశం ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపునకు ప్రతీకార్యకర్త సైనికుడిలా పనిచేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 30న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహించనున్న ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు రోడ్ షోను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, లింగాగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, రవి, రఫీక్, బుచ్చాగౌడ్, బాబు, బాల్ రెడ్డి, దేవయ్య, దేవేందర్ యాదవ్, కిషన్ పాల్గొన్నారు

ఘనంగా పెద్దమ్మతల్లి బోనాలు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 25: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లిలో పెద్దమ్మతల్లి బోనాలు గురువారం నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఏప్రిల్ 25: ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విధంగానే ఉన్నత లక్ష్యంతో చదువులో రాణించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. ఉత్తమ మార్కులు సాధించిన ఇంటర్ విద్యార్థులను గురువారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో అభినందించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో సిరిసిల్ల కేజీబీవీకి చెందిన ఎంపీసీలో జి.గంగాభవాని ఎంపీసీలో 987, మర్రిపల్లి కేజీబీవీకి చెందిన ప్రసన్న బైపీసీ 978, కేజీబీవీ తంగళ్లపల్లికి చెందిన వైష్ణవి సీఈసీ 911, ఎంపీహెచ్‌డబ్ల్యూ హాసని 980, ప్రథమ సంవత్సరం ఫలితాల్లో సిరిసిల్ల కేజీబీవీకి చెందిన బైపీసీలో వైష్ణవికి 433, మర్రిపల్లి కేజీబీవీకి చెందిన ఎంపీసీలో హస్విత 653, రుద్రంగి కేజీబీవీకి చెందిన హారిక 452, తంగళ్లపల్లి కేజీబీవీకి చెందిన అశ్విని సీఈసీలో 440, ఎంపీహెచ్‌డబ్ల్యూలో రేష్మ 480 మార్కులను సాధించారు. కార్యక్రమంలో డీఈవో రమేష్‌కుమార్, సెక్టోరల్ అధికారి పద్మజా, అధికారులు పాల్గొన్నారు.

రైతు వేదిక తలుపులు చోరీ

మానకొండూర్, ఏప్రిల్ 25: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో గల రైతు వేదిక తలుపులను పగుల కొట్టి బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి దూరంగా నిర్మించడం కాపలాదారుడు లేకపోవడం వల్ల గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని రైతులు తెలిపారు.

210 గ్రాముల గంజాయి స్వాధీనం

జమ్మికుంట, ఏప్రిల్ 25: జమ్మికుంట పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకుల నుంచి 210గ్రాముల గంజాయి ప్యాకెట్లను గురువారం పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. పాత గ్రేన్ మార్కెట్ సమీపంలో ఇద్దరు యువకుల కదలికలను గమనించిన ప్ర జలు పోలీస్‌లకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకు న్న పోలీస్‌లు పిట్టల మహేష్ వద్ద 100గ్రాములు, లింగాల శ్రీనివాస్ కార్తీక్ వద్ద 110గ్రాముల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేశామని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అనుమతి లేకుండా మట్టి తరలిస్తే చర్యలు

- తహసీల్దార్ అనుపమ

శంకరపట్నం, ఏప్రిల్ 25: ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్స్‌కావేటర్ నిర్వాహకులను తహసీల్దార్ అనుపమ హెచ్చరించారు. మండలంలోని కొత్తగట్టు గ్రామంలో గురువారం అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న సమాచారం మేరకు తహసీల్దార్ అనుపమ, ప్రత్యేకాధికారి, ఎంపీఈవో శ్రీవాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి మట్టి తరలిస్తే ఎక్స్‌కావేటర్‌ను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ట్రాక్టర్ డ్రైవర్లు, జేసీబీ యజమానులను హెచ్చరించారు. అనంతరం లోయకుంట కట్టకు గండి పెట్టిన రైతును పిలిచి తహసీల్దార్ అనుమప మాట్లాడారు. కట్ట గండి పుడ్చాలని ఆదేశించారు. గండి పూడ్చుకుంటే జరిమానా విధిస్తామని సదరు రైతును హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సెమినార్

గణేశ్‌నగర్, ఏప్రిల్ 25: ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాల కరీంనగర్‌లో టెక్నాలజీస్ ఫర్ అకౌంటింగ్ ఫైనాన్స్ అనే అంశంపై విద్యార్థులకు ఒకరోజు సెమినార్‌ని కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరికాంత్ ముఖ్య అతిథిగా హాజరై హజరై మాట్లాడారు. కామర్స్ విద్యార్థులు సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు సబ్జెక్టుకు సంబంధించిన టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్తులో మంచి అవకాశాలను అందుకోవచ్చన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు టెక్నాలజీని ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉంటే భవిష్యత్తులో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి రాజయ్య, వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఏ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ఎన్నికల పరిశీలకుడు అమిత్ కటారియా

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో ఎన్నికల నియమావళిపై సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలాసత్పతి ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం అమిత్ కటారియా మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు.

పార్లమెంట్ నియోజకవర్గ పోలీస్‌శాఖ పరిశీలకుడు మనీష్ చౌదరి మాట్లాడుతూ ఎక్కడ ఏ ఫిర్యాదు వచ్చినా వెంటనే స్పందించి తగినచర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని, నగదు తరలింపుతోపాటు ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. కరీంనగర్‌లోని ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో ఉదయం 11.30 నుంచి 12.30 మధ్యలో ఏవైనా ఫిర్యాదులపై ప్రజలు నేరుగా కలువవచ్చని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీకుమార్ పాండే మాట్లాడుతూ అధికారులు అభ్యర్థుల ఎన్నికల వివరాలను పకడ్బందీగా నమోదు చేయా లని సూచించారు. అభ్యర్థుల వ్యయంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎక్కడ నిబంధన ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అమిత్ కటారియా, కలెక్టర్ పమేలాసత్పతి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా జిల్లా యంత్రాంగం తరపున పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 42 మండలాలు ఉన్నాయని తెలిపారు. మొత్తం 23.83 లక్షల జనాభా, 17.88 లక్షల ఓటర్లు ఉన్నారన్నారు. పురుషులు 8,73,952, మహిళా ఓటర్లు 9.14 లక్షలు ఉన్నారని చెప్పారు. పీడబ్ల్యూడీ ఓటర్లు 41,718 మంది, 85 సంవత్సరాలు దాటిన ఓటర్లు 13,780 మంది ఉన్నారన్నారు. వీరికి ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పార్లమెంట్ పరిధిలో 2,194 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, అన్ని వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. 1,484 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. పోలింగ్‌కు 13,635 మంది అధికారులు, సిబ్బందిని వినియోగిస్తున్నామని చెప్పారు. 288 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలున్నాయని, ఇక్కడ ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రత్యేక దృష్టిపెట్టామని అన్నారు. సివిజిల్ యాప్ ద్వారా 106 ఫిర్యాదులు రాగా 73 ఫిర్యాదులను పరిష్కరించామని కలెక్టర్ తెలిపారు. సువిధ కింద అనుమతుల కోసం 142 దరఖాస్తులు రాగా 102 అనుమతులు ఇచ్చామని, 15 ప్రాసెస్‌లో ఉన్నాయని చెప్పారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా 36 మంది అభ్యర్థులు 62 నామినేషన్లను వేశారని అన్నారు. తనిఖీల్లో భాగంగా ఇప్పటి వరకు 7.95 కోట్ల నగదును పట్టుకున్నామని తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న 23.71 లక్షల విలువగల మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. రెండు కిలో 342 గ్రాముల గంజాయిని పట్టుకున్నామని అన్నారు. 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నగదు సామగ్రి తరలించకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 75శాతం పోలింగ్ నమోదైందని, ఈసారి పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేకంగా కృషిచేస్తున్నామని చెప్పారు. 46వేల మంది కొత్త ఓటర్లు నమోదయ్యారని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు 8,552 ఈవీఎంలను సిద్ధం చేస్తున్నామని, ఎక్కడైనా ఇబ్బంది వస్తే వెంటనే వాటి స్థానంలో ఈవీఎంలను ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

● పటిష్ట బందోబస్తు ఏర్పాటు: సీపీ అభిషేక్ మహంతి

పార్లమెంట్ ఎన్నికలకు పోలీసుశాఖ తరపున పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి తెలిపారు. ఎన్నికల పరిశీలకులకు పోలీసుశాఖ తరపున తీసుకుంటున్న చర్యలను వివరించారు. నగదు, సామగ్రి తరలించకుండా ప్రత్యేక తనిఖీలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో హన్మకొండ కలెక్టర్ సిక్తాపట్నాయక్, సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, కరీంనగర్ అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్డీవో కె మహేశ్వర్, సిరిసిల్ల అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, హన్మకొండ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ, కాజీపేట, హుస్నాబాద్ ఏసీపీలు తిరుమల్, సతీష్, ఆర్డీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డీజే సౌండ్ సిస్టం సీజ్.. ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 25: మండలంలోని వెంకటాపూర్‌లో ఎలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టం ఏర్పాటు చేసి నృత్యాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో డీజే సిస్టంను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని యాదవ కాలనీలో రోడ్డుకు అడ్డంగా డీజే సౌండ్ సిస్టంను ఉంచి కొందరు యువకులు పాటలపై నృత్యాలు చేస్తున్నారని సమాచారంతో హెడ్ కానిస్టేబుల్ శంకర్ ఆధ్వర్యంలోని సిబ్బంది అక్కడికి చేరుకున్నారని పేర్కొన్నారు. అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టంను ఎలా పెట్టారని ప్రశ్నించిన పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, సిరిసిల్ల పట్టణానికి చెందిన డీజే సౌండ్ సిస్టం యజమాని వంగరి సుధాకర్, ఆపరేటర్ అంకెల మహేష్‌లపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రహదారులపై రైతులు ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టకూడదని ఎస్సై రమాకాంత్ అన్నారు.

కొండగట్టులో ముమ్మరంగా పారిశుధ్య పనులు



పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

మల్యాల, ఏప్రిల్ 25: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాలు ముగియడంతో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఒక్క రోజు ముందు నుంచే దిగువ కొండగట్టు, కొండపైన పారిశుధ్య పనులను ప్రారంభించారు. ఉత్సవాలు బుధవారం ముగియగా గురువారం కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 200మంది సిబ్బంది, దేవస్థానం సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఉత్సవాల సందర్భంగా పారిశుధ్య పనులను డీపీవోతో పాటు జిల్లాలోని పలువురు ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కారోబార్లు నిరంతరం పర్యవేక్షించారు. గతంలో కన్న ఈసారి పారిశుధ్య పనులకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. గ్రామ ప్రత్యేకఅధికారి స్వాతి, స్థానిక పంచాయితీ కార్యదర్శి స్వప్న తదితరులు ఈసందర్భంగా తమకు సహకరించిన కలెక్టర్, డీపీవో ఇతర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వైర్లపై టార్పాలిన్ పడి కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

● రూ. 35 లక్షల ఆస్తి నష్టం

● సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్ఈ



వైర్లపై పడ్డ టార్పాలిన్ కవర్

కథలాపూర్, ఏప్రిల్ 25: రైతులు వడ్లపై కప్పుకున్న టార్పాలిన్ గాలికి కొట్టుకు వచ్చి వైర్లపై పడడంతో బొమ్మెన సబ్ స్టేషన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ఈ సంఘటనలో సుమారు 35 లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించిందని ఏఈ జమీల్‌పాషా తెలిపారు. తక్కళ్ళపల్లి శివారులో ఉన్న వరద కాలువ పక్కన ప్యాక్స్ కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం కొనుగోళ్ళు సాగిస్తున్నారు. ఆప్రాంతంలో రైతులు వడ్లు ఆరబెట్టుకుంటున్నారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకుంటుండంతో ధాన్యంపై పాలథీన్ కవర్లు కప్పుకున్నారు. అయితే గురువారం ఒక్కసారిగా గాలి వీయడంతో పాలథీన్ కవర్ లేచి పక్క నే ఉన్న 11కేవీ వైర్లపై పడి చుట్టుకుంది. దీంతో సబ్‌స్టేషన్‌లో ఉన్న 5ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ వేడిగా మారింది. పూర్తిగా ఆయిల్‌తో పాటు వైండింగ్ కాలిపోవడం వల్ల సుమారు 35 లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఈ సత్యనారాయణ బొమ్మెన చేరుకుని సబ్‌స్టేషన్‌ను పరిశీలించి మరమ్మ తుల కోసం చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరాకు కొంత మేర ఇబ్బంది తలెత్తే అవకాశాలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. డీఈఈ రఘుపతి, ఎంఆర్‌టీ ఏఈలు, మెట్‌పల్లి డీఈఈ తిరుపతి ఉన్నారు.



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ

నంబర్ ప్లేట్‌లేని వాహనాలు నడిపితే చర్యలు



వాహనాలను చూపిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరావు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25: నంబర్ ప్లేట్ లేని వాహనాలను నడిపితే చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఎస్సై చిరంజీవి తన సిబ్బందితో నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపై నడుపుతున్న 32 వాహనాలను పట్టుకున్న వాటిని గురువారం పరిశీలించారు. సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు తమ బండికి సంబంధించిన అన్నిరకాల పత్రాలను తమ వెంట ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్‌లను తప్పకుండా ఆర్‌టీవో నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై అంజేయులు, జనార్ధన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆరు వాహనాలు సీజ్

కొడిమ్యాల, ఏప్రిల్ 25: మండలంలోని దొంగలమర్రి పోలీస్ చెక్ వద్ద గురువారం రాత్రి కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నెంబరు లేని, ట్రీపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేసిన ఆరు వాహనాలను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న గోశాలలో మెగా వైద్య శిబిరం

- కమిషనర్ ఆదేశాల మేరకు కదిలిన అధికార యంత్రాంగం





గోశాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ మంజువాణి, కోడెలకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారులు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 25: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలోని కోడెల సంరక్షణకు అధికార యంత్రాంగం కదిలింది. రెండు రోజుల క్రితం రాజరాజేశ్వరస్వామి వారి సన్నిధికి వచ్చిన దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గోశాలను సందర్శించారు. కోడెల సంరక్షణకు ఆలయ అధికారులు చేపట్టిన చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడెలపై ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడెలకు సరైన పోషకాహారాన్ని, పచ్చిగడ్డి, పల్లిపిండి లాంటి వాటిని అందించాలని అధికారులను ఆదేశించారు. గోశాల పరిస్థితిని కమిషనర్ సీఎంవో దృష్టికి తీసుకెళ్లారు.

ఈ నేపథ్యంలో సీఎంవో ఆదేశాల మేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ మంజువాణి రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి కృష్ణప్రసాద్‌తో కలిసి గురువారం తిప్పాపూర్‌లోని గోశాలను సందర్శించారు. ఆమె పర్యవేక్షణలో కోడెలకు వైద్యశిబిరం నిర్వహించారు. కోడెలు బలహీనంగా ఉండడానికి గల కారణాలను తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో వైద్య పరీక్షలు జరిపి అవసరమైన కోడెలకు వ్యాక్సినేషన్, గాలికుంటు టీకాలు వేశారు. గోశాలలో ఉన్న 1093 కోడెలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉన్నతాధికారిణి జ్యోతి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కొమురయ్య, పశువైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కులకు ఉపయోగించే గోవుల సంరక్షణపై అధికార యంత్రాంగంలో కదలిక రావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి





లవన్ కుమార్(ఫైల్), మంతెన గంగు(ఫైల్)

గొల్లపల్లి, ఏప్రిల్ 25: గొల్లపల్లి నల్లగుట్ట వద్ద జగిత్యాల-ధర్మారం ప్రధాన రహ దారిపై ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని అతివేగంగా వచ్చి కారు ఢీకొట్టిన దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికి చెందిన బంక లవన్‌కుమార్ (20) అనే యువకుడు ఓ న్యూస్ ఛానల్‌లో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పనులనిమిత్తం గొల్లపల్లి నల్లగుట్ట నుంచి జగిత్యాల వైపు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అదే సమయంలో జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి అతివేగంగా వస్తున్న ఏపీ01 ఏపీ 4748 అనే నంబరు గల షిఫ్ట్ డిజైర్ కారు ముందు ఉన్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న లవన్ కుమార్ ద్విచక్ర వాహనాన్ని అతివేగంతో ఢీకొట్టగా లవన్ కారు బోనట్ పైనుంచి ఎగిరి రోడ్డుపై పడ్డాడు. ఈ దుర్ఘటనలో లవన్ కుమార్ తలకు బలమైన దెబ్బ తగలడంతో తీవ్రంగా గాయపడగా గమనించిన స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం 108 అంబులెన్స్‌లో జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యచికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. దీంతో ఉన్న ఒక్క కొడుకు తమ కళ్లేదుటే తిరిగిరాని లోకాలకు తరలివెళ్లడంతో మృతుడి తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి. మృతుడి మేనమామ దావన్‌పల్లి లింగన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. అతివేగం, నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లనే ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్సై వివరించారు.

● యువకుడి నేత్రదానం..

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన బంక లవన్‌కుమార్ రెండు నేత్రాలను పుట్టెడు దుఃఖంలోను తల్లిదండ్రులు దానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. తమ ఉన్న ఒక్కగానొక్క కొడుకు తమ కళ్లెదుటే మృతిచెంది కడుపుకోత మిగిల్చినా తను పోతూ ఇతరుల కు నేత్రదానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపడం కొంత ఉపశమనాన్ని కలిగిస్తుందని ఈసందర్భంగా మృతుడు లవన్‌కుమార్ తండ్రి బంక వెంకటేశం బోరున విలపించారు.

● వెల్లుల్లలో వృద్ధురాలు..

మెట్‌పల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన మండలంలోని వెల్లుల్ల గ్రామానికి మంతెన గంగు(62)అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు గురువారం తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం...వెల్లుల్ల గ్రామానికి చెందిన మంతెన గంగు భర్త మంతెన నర్సయ్య దిచక్ర వాహనంపై ఈనెల 22న ఆత్మకూర్ గ్రామంలోని శుభకార్యానికి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి బయలు దేరారు. ఈ క్రమంలో ఆత్మకూర్ పెద్దమ్మ ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో మంతెన గంగు తలకు బలమైన గాయాలు తగిలాయి. దీంతో మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న మంతెన గంగు బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త మంతెన నర్సయ్య ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ



పగలకొట్టి ఉన్న బీరువా తలుపులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 25: మండలంలోని వెల్లుల్ల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి విలువైన ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లినట్లు గురువారం పోలీసులు తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొంచంపల్లి లక్ష్మి భర్త గల్ఫ్‌కు వెళ్లగా తన కొడుకుతో కలిసి ఉంటుంది. బుధవారం మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలోని శుభకార్యానికి తన కొడుకుతో కలిసి వెళ్లింది. తిరిగి గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటివెనుక భాగంలోని తలుపులు పగటగొట్టి చొరబడినట్లు గుర్తించింది. ఇంట్లోని బీరువాలో దాచుకున్న ఐదున్నర తులాల బంగారం, 15 తులాల వెండి, రూ. 42వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించింది. దీంతో గ్రామంలోని పలువురికి తెలిపి పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలాన్ని పోలీసులు, క్లూస్ టీం వివరాలను సేకరించారు. పొంచంపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 25: మండలంలోని పైడిమడుగు గ్రామానికి చెందిన గౌడశెట్టి సాయిలు(48)అనే వ్యక్తి గురువారం చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సాయిలు పశువుల కాపారిగా పనిచేస్తు జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయిలు గ్రామ శివారులోని వాగులో చేపలు పట్టేందుకు వెళ్లి చేపలు పడుతున్న క్రమంలో విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నాటు ఎస్ఐ తెలిపారు.

కర్రలు పడి వృద్ధురాలి మృతి

మల్యాల, ఏప్రిల్ 25: ఇంట్లో సరుగుపై గల కర్రలను తీస్తుండగా ప్రమాదవశత్తూ పడడంతో ఓ వృద్ధురాలు తీవ్ర గాయాలపాలై మృతి చెందింది. ఎస్సై అబ్దుల్ రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముత్యంపేట కు చెందిన మర్రి రాజేశ్వరి(80)అనే వృద్ధురాలు గురువారం తన ఇంట్లో గల కర్రలను తీస్తుంది. ఈ క్రమంలో కర్రలు రాజేశ్వరిపై పడడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అక్కడిక్కడే మృతి చెందింది. మృతురాలి సోదరుడు ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● రూ.50వేల పట్టివేత

ఎలాంటి డాక్యుమెంట్స్ లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. మల్యాలలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా సాయికృష్ణ అనే వ్యక్తి వద్ద ఎలాంటి రసీదులు లేని రూ.51,100 లభించగా పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు.

కన్నుల పండువగా చంద్ర రథోత్సవం

- ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి వారికి మొక్కులు చెల్లించుకున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో సీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులు



చంద్రరథంపై విహరిస్తున్న స్వామివారు

ఇల్లందకుంట, ఏప్రిల్ 25: కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి చేపట్టిన చంద్ర రథోత్సవం కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం 5గంటలకు చంద్ర రథాన్ని జయజయ నామస్మరణాలతో, డప్పుచప్పుళ్లు, కోలాట నృత్యాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి రథోత్సవ కార్యక్రమం తిరుమాడ వీధుల్లో చంద్ర రథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. భక్తులు స్వయంగా తాళ్లతో రథాన్ని లాగుతూ స్వామి వారిని దర్శించుకున్నారు. సుమారు గంట పాటు రథయాత్ర కొనసాగగా స్వామివారి ఊరేగింపుగా ఆలయానికి ఆరు గంటలకు చేరుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు 20వేల మంది భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో సీఐలు కిశోర్, బొల్లం రమేశ్, ఎస్ఐలు తిరుపతి, రాజకుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



డోలు వాయిస్తున్న కళాకారులు

బీజేపీతో రాజ్యాంగానికే ప్రమాదం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

భగత్‌నగర్, ఏప్రిల్ 25: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగానికే ప్రమాదమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకోసం ఇండియా కూటమి పనిచేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామ్య పక్షంగా ఉన్నందున తెలంగాణలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తామన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సీపీఐ రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చి తమ మద్దతు కోరారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, కాంగ్రెస్ అభ్యర్థుల కోసం సీపీఐ శ్రేణులు పని చేస్తారన్నారు. రెండోసారి కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం, హిందూముస్లిం మధ్య చిచ్చు పెట్టే కుట్రలు చేస్తోందన్నారు. పదిసంవత్సరాలుగా దేశ సంపదను మోదీ పెట్టుబడిదారులకు అప్పనంగా అప్పగించారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో మతోన్మాద బీజేపీకి బుద్ధి చెప్పాలన్నారు. కేసీఆర్ అహంకారం తగ్గలేదని, సీఎంగా ఉన్నప్పుడే ప్రాజెక్టులు, భూసమస్యలు, ధరణి పోర్టల్‌పై అనేక సలహాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు సీపీఐ శ్రేణులను కలుపుకొనిపోతే మంచి ఫలితం ఉంటుందన్నారు. సమావేశంలో రాజన్నసిరి సిల్ల, కరీంనగర్ జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్రకౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గడీల దొరలకు.. గరీబోళ్ల బిడ్డకు పోటీ

- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్
- అట్టహాసంగా నామినేషన్ దాఖలు
- హాజరైన గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



ర్యాలీలో ప్రసంగిస్తున్న సంజయ్‌కుమార్, పక్కన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయ్‌పటేల్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గడీల దొరలకు గరీబోళ్ల బిడ్డకు మధ్య లోక్‌సభ ఎన్నికల పోటీ జరుగుతున్నదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా గుజరాత్ ముఖ్య మంత్రి భూపేంద్రపటేల్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ అనంతరం నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బీజేపీ తనకు టికెట్ ఇవ్వగానే మీ అందరి ఆశీస్సులతో కరీంనగర్ బిడ్డగా నామినేషన్ దాఖలు చేశానన్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు వందల కోట్ల ఆస్తులు ఉన్నాయన్నారు. వారు గెలిస్తే వేల కోట్లు సంపాదిస్తారని, తనను గెలిపిస్తే మీకోసం వేల కేసులు పెట్టినా పోరాటం చేస్తానన్నారు. వారి ఆస్తి వేల కోట్లు అయితే తన ఆస్తి ప్రజలే అన్నారు.గడీల వారసులు కావాలా? గరీబోళ్ల బిడ్డ కావాలా ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఏనాడైనా ప్రజల కోసం పోరాటం చేశారా అని ప్రశ్నించారు. తాను లోకల్ అని, బీఆర్‌ఎస్ అభ్యర్థి నాన్‌లోకల్ అని, కాంగ్రెస్ అభ్యర్థి లోకలా.. నాన్ లోకలా అనేది కాంగ్రెస్ కేడరే చెప్పుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. దేశానికి మోదీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు తెచ్చుకుని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఇక్కడున్న మంత్రి ఏం మాట్లాడుతున్నాడో ఎవరికీ అర్థం కాదని, మాట్లాడితే తన్నుడు గుద్దుడు, తిట్టడం తప్ప సాధించేదేమి లేదన్నారు.



తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న బండి సంజయ్

బండి సంజయ్ గెలుపు ఖాయమైంది..
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కరీంనగర్ ప్రజల ఆశీస్సులు బండి సంజయ్‌కి పుష్కలంగా ఉన్నాయని, ఆయన గెలుపు ఖాయమైంద బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ నామినేషన్ కార్యక్రమానికి హాజరై ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలని ప్రశ్నించారు. కేసీఆర్ మళ్లీ ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నాడని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలలను సిగ్గు లేకుండా కాంగ్రెస్‌లోకి పంపి రాజకీయం చేస్తున్నాడన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి దోచుకోవడం తప్ప చేసిందేమి లేదన్నారు.

అత్యధిక మెజారిటీతో గెలిపించండి
గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయిపటేల్

గురువారం కరీంనగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా బండి సంజయ్ కుమార్ నామినేషన్ కార్యక్రమానికి హాజరయిన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రభాయి పటేల్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజల కోసం నిత్యంపోరాటం చేసే బండి సంజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

బీజేపీ అభ్యర్థిగా నామినేషన్

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ కుమార్ గురువారం నామినేషన్ వేశారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్రరజనీకాంత్‌బాయ్ పటేల్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, గంగ్ర నళిని, కిరణ్‌తో వెళ్లి నామినేషన్ వేశారు.

కదం తొక్కిన కాషాయ దళం

భగత్‌నగర్: బండి సంజయ్‌నామినేషన్ సందర్భంగా కరీంనగర్‌లో కాషాయ దళం కదం తొక్కింది. నగరంలోని ఎస్సారార్ కళాశాల వద్ద ప్రారంభమైన నామినేషన్ బైక్ ర్యాలీ టవర్‌సర్కిల్‌మీదుగా గీతాభవన్ వరకు సాగింది. మూడు గంటల పాటు సాగిన ర్యాలీకి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అడగండి

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలను కలిసి ఓట్లు అభ్యర్థించాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ నాయకులకు సూచించారు. గురువారం నగరంలోని పార్లమెంట్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై, అభ్యర్థులపై ఆ పార్టీల కార్యకర్తలు అసహనంతో ఉన్నారన్నారు. ఆ పార్టీలకు చెందిన కార్యకర్తలను కలిసి గొడవలకు అస్కారం లేకుండా సుహృద్భావ వాతావరణంలో వారిని కలిసి ప్రచారం చేయాలన్నారు.



నామినేషన్ అందజేస్తున్న బండి సంజయ్‌కుమార్

మూడు నెలలకే శాపనార్థాలు పెడుతున్నారు

- బీఆర్‌ఎస్ హయాంలో నియంతృత్వ పాలన సాగింది
- మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, ఏప్రిల్ 25: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలకే ఏదో జరిగిపోతున్నట్లు కొందరు పిల్లి శాపనార్థాలు పెడుతున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని నుస్తులాపూర్‌లో ఆయన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో నియంతృత్వ పాలన సాగిందని విమర్శించారు. ప్రజలు డబుల్ బెడ్రూం ఇళ్లు, తమ పిల్లలకు ఉద్యోగాలు అడిగితే పోలీసులతో దౌర్జన్యం చేశారన్నారు. దీంతో ప్రజలు బీఆర్‌ఎస్‌పై విసిగిపోయి ఇలాంటి పాలన తమకొద్దని కాం గ్రెస్‌కు అధికారం ఇచ్చారని అన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ఖజానాను ఖాళీ చేసిందని, అయినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 48 గంటలల్లో రాష్ట్రంలోని మహిళలం దరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే పథకాన్ని ప్రారంభించిందన్నారు. బండి సంజయ్, వినోద్ కుమార్ ఎంపీలుగా చేసిన సమయంలో చేసిన అభివృద్ధి పనులు చెప్పుకునే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు.



నుస్తులాపూర్‌లో ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సేవ చేసేందుకు ఒక్క అవకాశం ఇవ్వండి
కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

తనకు ఎంపీగా ఒక్క అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉండి అభివృద్ధి చేసి చూపెడతానని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. బీఆర్ ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్ తనకంటే మేధావి ప్రపంచం లో ఎక్కడా లేడు అనే విధంగా మాట్లాడతారని ఎద్దేవా చేశారు. స్థానిక సమస్యలను ఆయన పట్టించుకోడా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సహాయపడ్డారు.



బీ ఫాం అందుకుంటున్న వెలిచాల రాజేందర్‌రావు

ఆగస్టు 15 వరకు రుణమాఫీ చేస్తాం..

మానకొండూర్: రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీని ఆగస్టు 15వరకు అమలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మానకొండూర్‌లో గురువారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చెరువుకట్ట బస్టాండ్ నుంచి తూర్పు దర్వాజ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ వర్షాకాలం పంటతోనే 500 రూపాయల బోనస్‌ను రైతులకు అందజేస్తామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పాల్గొన్నారు.



ప్రచారానికి హాజరైన ప్రజలు

దేవుడు గుళ్లో ఉండాలి...
భక్తి గుండెల్లో ఉండాలి....

కరీంనగర్ అర్బన్/శంకరపట్నం: దేవుడు గుళ్లో ఉండాలి... భక్తి గుండెల్లో ఉండాలి...కాని ఓట్ల కోసం బీజేపీ నాయకులు రాముడి ఫోటో రోడ్లపైకి తెచ్చారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. శంకరపట్నం మండల కేంద్రంలో గురువారం రాత్రి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో మంత్రి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు.

సీపీఐ మద్దతు కోరిన కాంగ్రెస్ అభ్యర్థి

భగత్‌నగర్: కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్, మానకొండూర్ శాసనసభ్యుడు కవ్వంపల్లి సత్యనారాయణరావు గురువారం సీపీఐ కార్యాలయానికి వెళ్లి ఆ పార్టీ నాయకుల మద్దతు కోరారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షాలుగా ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ అభ్యర్థుల విజయం కోసం సీపీఐ శ్రేణులు పనిచేస్తారన్నారు.

వెలిచాల రాజేందర్‌రావుకు బీఫామ్ అందజేత

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావును కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం బుధవారం రాత్రి ఖరారు చేసింది. ఈమేరకు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ రోహిత్ చౌదరి సమక్షంలో తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జి దీపాదాస్ మున్షి గురువారం రాజేందర్‌రావుకు కాంగ్రెస్ పార్టీ బి ఫామ్‌ను అందజేశారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 'అల్ఫోర్స్'కు ఉత్తమ ర్యాంకులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలి తాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో జాతీయ స్థాయి అత్యుత్తమ ర్యాంకులను సాధించడం హర్షణీయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. ఎం.హర్షిత్ 252వ ర్యాంకు, ఎ.వర్ధన్‌రావు 444, పి.మనోహర్ 466, జి.శ్రీహాస్ 503, బి.భరద్వాజ్‌నాయక్ 781, పి.చందన 1213, సత్యాఅమూల్యా 1301, సుబోధ్‌చౌదరి 1367, కె.శ్రీనిధి 1562, ఎం.డి.షఫిక్ 1603, మిత్ర 1612, సిహెచ్.అనూహ్య 1632, ఏ.శివవరుణ్ 1719, ఎస్.ప్రణయ్ 1721, పి.రాహుల్ 1751, ఎం.ప్రణీత్‌రెడ్డి 1912, జె.ఉమామైత్ర 1953వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు.



టాపర్స్‌తో కలిసి విజయసంకేతం చూపుతున్న అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి

ఎల్.అరుణ్‌కుమార్ 2353, సిహెచ్.సిద్ధార్థ 2444, పి.రాఘవీరారెడ్డి 2510, కె.విశాల్‌రెడ్డి 2557, కె.రోహన్‌ప్రీత్ 2643, జె.హర్షవర్ధన్ 2908, జి.లహరి 2965వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని ఇనుమడింపజేశారని అన్నారు. 1000లోపు ఐదు ర్యాంకులు, 5వేలలోపు 34, మరియు 461 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించడం విశేషమని అన్నారు. ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంచే కోచింగ్ ఇస్తామని చెప్పారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, అధ్యాపకులను అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు.

'ట్రినిటి' విద్యార్థుల అద్భుత ప్రతిభ

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ట్రినిటి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరించి జాతీయ స్థాయిలో ఉత్తమమైన పర్సంటైల్‌తో పాటు ర్యాంకులు సాధించారు. జె.హానికర్ అత్యుత్తమ ర్యాంకు 48, డి.గణేశ్‌రావు 485, ఎం.చిత్రాంజలి 532, ఎ.రఘుపతి 789, ఎల్.జస్వంత్ 910, సిహెచ్.శివ 1397, ఎస్.సుమంత్ 1473, బి.వర్షితరాణి 1626, ఆర్.నిఖిల్ 2279, ఎం.ధనుంజయ్ 2464, సిమెచ్.ఆశిష్‌నాయక్ 3113, ఎ.గంగాధర్ 3289, పి.శ్రీజ 4563, జె.కీర్తి 4633, డి.దేవేందర్ 4836, ఎల్.చంద్రపతి 4883, ఎం.హిమబిందు 5210, బి.అక్షిత్‌గౌడ్ 5310, బి.సందీప్ 5685, బి.వంశీకృష్ణనాయక్ 5964, వి.శ్రీతేజ 6262 ర్యాంకులను సాధించారు.



టాపర్స్‌తో కలిసి విజయసంకేతం చూపుతున్న ట్రినిటి చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులు కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చక్కని ప్రణాళికతో, పరీక్షల్లో విద్యార్థులు చేస్తున్న తప్పులను ఎప్పటికప్పుడు సరిచేస్తూ అభ్యసనం పెంచడం ద్వారా సమయపాలన నేర్పిండంతో అద్భుత ఫలితాలను సాధించారని అన్నారు. ప్రతి సంవత్సరం ఎంతో మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్పుతున్నామని అన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'శ్రీచైతన్య' విజయదుందుభి



టాపర్స్‌ను అభినందిస్తున్న శ్రీచైతన్య జూనియర్ కళాశాలల చైర్మన్ రమేశ్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 25: ఐఐటీ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు వివిధ క్యాటగిరీలలో అద్భుత ర్యాంకులు సాధించినట్లు శ్రీచైతన్య జూనియర్ కళాశాలల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి తెలిపారు. పింగిలి వెన్నెల 27, రాపోలు శ్రీవాణి 601, మణిదీప్‌రెడ్డి 952, ఒ.రిత్విక 986, కె.రోహిత్ 1399, బి.హారిక 4569, ఇ.సూర్యకాంత్ 10,832, మాదవి జ్యోతిర్మయి 11,592, పి.హాసిని 14,317, కె.శ్రీనిత్ 25,121, ఎం.శ్రీవిద్య 25,539, పి.వర్షిణి 33,892 ఆల్ ఇండియా ర్యాంకులను సాధించారని అభినందించారు. జేఈఈ మెయిన్స్‌కు హాజరైన వారిలో 60శాతం మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించి శ్రీచైతన్య మరో సంచలనం సృష్టించిందన్నారు. కార్యక్రమంలో శ్రీచైతన్య కళాశాల డైరెక్టర్ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్ జగన్ మోహన్‌రెడ్డి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రాధాకృష్ణ, మోహన్‌రావు, ఏజీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా: పింగిలి వెన్నెల



కళాశాల షెడ్యూల్‌ను ఫాలో అవుతూ లెక్చరర్ల సలహాలతో జేఈఈ మెయిన్స్ పరీక్షలో మంచి ర్యాంకు తెచ్చుకున్నా. కాలేజీ డీన్, లెక్చరర్ల ప్రేరణతో మెయిన్స్‌లో అద్భుత ర్యాంకు రావడానికి తోడ్పడింది. మా తల్లిదండ్రుల తోడ్పాటు కూడా ఉంది. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా మంచి ర్యాంకు సాధిస్తా. భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను అవుతా.

బండి సంజయ్ నామినేషన్‌కు తరలిన నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 25: బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్‌కుమార్ నామినేషన్‌కు వివిధ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోని బీజేపీ శ్రేణులు గురువారం కరీంనగర్‌కు తరలి వెళ్లాయి. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు బుగ్గారెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణహరి, గణేశ్, కిరణ్‌నాయక్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీజేపీ మండల అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్ ఆధ్వర్యంలోనాయకులు తరలివెళ్లారు. బీజేపీ నాయకులు కోల కృష్ణగౌడ్, వరి వెంకటేశ్, గిరి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి ఆధ్వర్యంలో బండి సంజయ్ నామినేషన్‌కు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

చందుర్తి: బీజేపీ నాయకులు గురువారం బండి సంజయ్ కుమార్ నామినేషన్ తరలివెళ్లారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రాకేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

బోయినపల్లి, ఏప్రిల్ 25: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సమక్షంలో గంగాధర మండలం మధుర నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్‌లో చేరారు. బోయినిపల్లి ఎంపీపీ వర్లపల్లి వేణుగోపాల్, సెస్ డైరెక్టర్ కొత్తపల్లి సుధాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, బోయినిపల్లి ఎంపీటీసీ బుచ్చమ్మలక్ష్మీరాజం, అనంతపల్లి ఎంపీటీసీ కంకణాల వనజ పురుషోత్తంరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, రేణుక తిరుపతి, మధు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ అంజయ్య శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీ మల్లేశం, కందుల అరుణ గంగారెడ్డి, గంగ్రెటి శ్రీనివాస్, కొత్తకొండ తిరుపతి, కొప్పుల స్వామి, మాజీ ఎంపీటీసీ వనితరమేష్, మాజీ ఉప సర్పంచులు భాగ్యలత శ్రీనివాస్, రామంచ శ్రీనివాస్, ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రామారావు, సతీష్ గౌడ్, ఎండీ బాబు, సువిన్ యాదవ్, ఎంపీటీసీ సభ్యులు ఉపేందర్, కొంకటి శిరీష మధు పాల్గొన్నారు.



ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

నేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే



సాయి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 25: సిరిసిల్లలో నేత కార్మికుల ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌కు చెందిన వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయికుమార్ ఆత్మహత్య చేసుకోగా గురువారం రాత్రి స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో సాయి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం పార్టీ తరఫున ఆ కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం నేతన్నలు ఆత్మహత్య చేసుకోకుండా వారికి ధైర్యం ఇచ్చామన్నారు. చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, బతుకమ్మ చీరల ఆర్డర్లు, చేనేత బంధును తీసుకొచ్చి మెరుగైన ఉపాధి కల్పించామని, గౌరవ వేతనాలు రూ.15 నుంచి 20 వేల వరకు వచ్చే విధంగా రూపకల్పన చేశామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక నాలుగున్నర మాసాల్లో నలుగురు కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకేరోజులో సిరిసిల్ల పట్టణంలో వార్పిన్ కార్మికుడు యువకుడు అడిచెర్ల సాయికుమార్, తంగళ్లపల్లిలో నేత కార్మికుడు అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసుకోవడం ప్రభుత్వం చేసిన హత్యలుగా తాము భావిస్తున్నామని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్‌పై కోపంతో తన నియోజకవర్గం అని రేవంత్‌రెడ్డి, ఆయన ప్రభుత్వం ఈ రకంగా వేధించడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వ మొద్దు నిద్ర వీడి బకాయిలను 24 గంటల్లో చెల్లించాలన్నారు. మానవతా దృక్పథంతో వెంటనే ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 24 గంటల్లో స్పందించక పోతే రోడ్డు ఎక్కుతామని, ఈ ప్రభుత్వాన్ని వదిలిపెట్టబోమని అన్నారు. నేతన్న కుటుంబాలు ధైర్యంగా ఉండాలన్నారు. మాజీ ఎంపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సిరిసిల్ల కార్మిక వర్గాన్ని కాపాడింది కేసీఆర్ ప్రభుత్వమేనన్నారు. సిరిసిల్లలో పనిలేక బతకడానికి వనరులు లేకనే సాయి చనిపోయాడని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని రెండు మూడు మాసాలుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశామన్నారు. బతకమ్మ చీరల పాలసీని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకొస్తే ప్రస్తుత ప్రభుత్వం, అధికారులు చిన్నచూపు చూశారని ఆరోపించారు. నేత కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఈ ప్రభుత్వం మెడలు వంచి ఆర్డర్లు ఇప్పిస్తామని అన్నారు. సిరిసిల్లలో విలేకరుల సమక్షంలోనే మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. ఇటీవల పిచ్చి వ్యాఖ్యలు చేసిన కేకే మహేందర్‌రెడ్డి ఇప్పుడు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన అంకారపు మల్లేశం కుటుంబాన్ని కేటీఆర్ గురువారం రాత్రి పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు తోట ఆగయ్య, గూడూరి ప్రవీణ్, అంకారపు రవీందర్, గజభీంకార్ రాజన్న, పడిగెల రాజు, అబ్బాడి అనిల్ రెడ్డి, నులుగొండ శ్రీనివాస్ ఉన్నారు.

నేత కార్మికుల ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వం



నివాళులు అర్పిస్తున్న రాణీరుద్రమ

తంగళ్లపల్లి, ఏప్రిల్ 25: ప్రభుత్వం నేత కార్మికుల ప్రాణాలను తీస్తోందని బీజేపీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణీ రుద్రమ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన నేత కార్మికుడు అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసుకోగా బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రాణీరుద్రమ మాట్లాడుతూ నేత కార్మికులకు పని కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నెల రోజులుగా పనిలేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీక్ష చేస్తున్న కార్మికులను బకాయిలు మంజూరు చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి మంత్రి పొన్నం ప్రభాకర్ దీక్ష విరమింపజేశారని, నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వారం రోజుల్లోగా బకాయిలను విడుదల చేయాలని, లేకుంటే బీజేపీ పక్షాన ఆందోళన చేస్తామని అన్నారు. నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవద్దని త్వరలోనే బీజేపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆడెపు రవీందర్, మండల బీజేపీ అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 25: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని చిత్తుగా ఓడించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు అన్నారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని పదేళ్ల పాలించిన బీజేపీ ప్రజలపై పెను భారం మోపిందన్నారు. బడా కార్పొరేట్లకు వరాలు ఇచ్చిందని, మత విద్వేషాలు రెచ్చగోట్టిందని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చే ముందు నరేంద్ర మోదీ స్విట్జర్లాండ్‌లో ఉన్న నల్ల ధనాన్ని 100 రోజుల్లో తెచ్చి దేశ ప్రజల ఖాతాల్లో రూ.15లక్షల చొప్పున జమ చేస్తామని ప్రకటించారని, పదేళ్ల గడుస్తున్నా ఎందుకు ఇవ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. నోట్ల రద్దు, జీఎస్టీ వంటి పెను భారాలతో పేద మధ్యతరగతి ప్రజలను నడ్డి విరిచారన్నారు. అంబానీ అదాని వంటి కార్పొరేట్ శక్తుల ఆదాయం పెంచే విధంగా లక్షల కోట్లు రాయితీలు ఇచ్చారన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి 750 మంది రైతులను పొట్టన పెట్టుకున్నారన్నారు. నేటికి పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చారని, పెట్టుబడి దారులకు ఊడిగం చేస్తున్నారని మండిపడ్డారు. దళితలు, గిరిజనులు బలహీన వర్గాలపై బీజేపీ పాలనలో దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. బీసీ ప్రధానినని చెప్పుకుంటున్న నరేంద్రమోదీ బీసీ కలగణన ఎందుకు చెపట్టలేదో చెప్పాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్‌లకు కట్టబెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లిక్కర్ స్కాం రూ.100 కోట్లు మాత్రమేనని, ఎలక్టోరల్ బాండ్స్ అవినీతి రూ.12 వేల కోట్లకు చేరిందని, అందులో బీజేపీ రూ.678 కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. బీజేపీని మించిన అవినీతి పార్టీ మరొకటి లేదన్నారు. బీజేపీని ఓడించి దేశాన్ని కాపాడాలన్నారు. ఐదు సంవత్సరాలుగా కరీంనగర్ పార్లమెంటు సభ్యుడిగా ఉన్న బండిసంజయ్‌కుమార్ సిరిసిల్ల ప్రాంతానికి ఏ ఒక్క చిన్న పనీ చేయలేదన్నారు. ఇక్కడి ప్రజలను ఓటు అడిగే అర్హత లేదన్నారు. ఐదేళ్లలో ఐదుసార్లు కూడా ఆయన సిరి సిల్లలో పర్యటించలేదన్నారు. జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్గి, కోడం రమణ, ఎరవెళ్లి నాగరాజు, ముక్తికాంత అశోక్, సూరం పద్మ, శ్రీరాం సదానందం, అన్నల్‌దాస్ గణేష్, నక్క దేవదాస్, పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న స్కైలాబ్‌బాబు

ఉపాధి చూపించాలి

నేతన్నలకు ప్రభుత్వం తక్షణమే ఉపాధి చూపించాలని, ఆత్మహత్య చేసుకున్న కార్మికుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ వార్పిన్ కార్మికుడు అడిచెర్ల సాయి మృతదేహాన్ని గురువారం సాయంత్రం పరిశీలించి కుటుంబసభుయలను పరామర్శించారు. నేత కార్మికులు సాయి, అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసు కోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు రమణ, జవ్వాజి విమల పాల్గొన్నారు.